## ప్రజాజ్యోతి తెలుగు జాతీయ పత్రికకు విలేకరులు కావలెను

* కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా వార్తల్లో ముందుకు దూసుకుపోతున్న ప్రజాజ్యోతి దినపత్రిక కు వివిధ మండలాలకు రిపోర్టర్లు కావలెను
* బాన్సువాడ టౌన్, కామారెడ్డి టౌన్, కామారెడ్డి ఆర్బ, బిచ్కుంద, బీర్కూర్, తాడ్వాయి, లింగంపేట, నస్రుల్లాబాద్, మండలాలకు రిపోర్టర్లు కావలెను
* కనీస విద్యార్హత ఉంటే సరిపోతుంది. మిగతా వివరాలకు

ఈ క్రింది నెంబర్ ను సంప్రదించండి.

96665 56646



జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం, జనవరి 14, 2026 పేజీలు:9


## బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ కుర్చీ

# ఎటువైపు మొగ్గు?




### -వారసులకు ఇచ్చుకుంటే సెకండ్ క్యాడర్‌కు నిరాశేనా?
### -సెకండ్ క్యాడర్‌కు న్యాయం చేయాలి

**బాన్సువాడ, ఆర్ సి జనవరి 13(ప్రజాజ్యోతి)**

బాన్సువాడ మున్సిపాలిటీలో ఈసారి చైర్మన్ కుర్చీ ఎటువైపు మొగ్గుతుందన్న అంశం రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ సమీపిస్తున్న తరుణంలో అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీఆర్ఎస్ కూడా వ్యూహాత్మక అడుగులు వేస్తున్నాయి. ముఖ్యంగా మైనారిటీ వర్గానికి చైర్మన్ సీటు కేటాయింపు జరిగితే రాజకీయ సమీకరణాలు మారే అవకాశముందని నేతలు, రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.

బాన్సువాడ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు ఇద్దరూ అధికార




పార్టీలో కీలక స్థానాల్లో ఉండటంతో కాంగ్రెస్ పార్టీకి బలమైన క్యాడర్ ఉంది. ఇప్పటికే మున్సిపాలిటీపె పట్టును కొనసాగించేందుకు పార్టీ

-మిగతా 2లో..

## సురక్షిత ప్రయాణమే లక్ష్యం - రోడ్డు భద్రతపై

# పోలీసుల అవగాహన




2 లో

## కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికలపై

# పోలీస్ కమిషనర్ సమీక్ష

### శాంతియుత, స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణే లక్ష్యం
### పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య

2 లో



## కాలుష్యం.. మన భవిష్యత్తుకు

# ముప్పు

### జాగ్రత్తలు పాటిస్తేనే ఆరోగ్యకర సమాజం

నిజామాబాద్ రూరల్: జనవరి, 13 (ప్రజా జ్యోతి)

ప్రస్తుత కాలంలో అభివృద్ధి పేరుతో మనం చేస్తున్న అనేక చర్యలే మన జీవితాలకు ముప్పుగా మారుతున్నాయి. వాటిలో అత్యంత ప్రమాదకరమైనది కాలుష్యం. గాలి, నీరు, నేల కాలుష్యాలు రోజురోజుకూ పెరుగుతుండటంతో మానవ ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటోంది. కాలుష్యం కేవలం ప్రకృతి సమస్య మాత్రమే కాదు, ఇది సమాజ ఆరోగ్యానికి, రాబోయే తరాలకు పెను ప్రమాదంగా మారుతోంది.

**గాలి కాలుష్యం నిశ్శబ్ద హంతకుడు**

వాహనాల పొగ, పరిశ్రమల నుంచి వెలువడే విష వాయువులు, చెత్తను కాల్చడం వంటి చర్యల వల్ల గాలి

-మిగతా 2లో..



## బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ కుర్చీ

# ఎటువైపు మొగ్గు?

అధిష్ఠానం పావులు కదుపుతోంది.అయితే బాన్సువాడలో మైనారిటీ వర్గానికి కూడా గణనీయమైన క్యాడర్ ఉండటంతో, ఆ వర్గాన్ని కేంద్రంగా చేసుకుని బీఆర్ఎస్ కొత్త సమీకరణాలకు తెరలేపినట్లు సమాచారం. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ వర్గానికి చైర్మన్ సీటు కేటాయిస్తే, అసంతృప్తి చెందిన వర్గాలు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపే అవకాశముందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. దీంతో కాంగ్రెస్ చేతిలోని మున్సిపాలిటీ బీఆర్ఎస్‌కు దక్కే అవకాశాలు పెరుగుతాయా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఇక మరోవైపు, పోచారం కాసుల బాలరాజుకు బాన్సువాడలో బలమైన అనుచరగణం ఉండటం కాంగ్రెస్‌కు ప్రధాన బలంగా మారింది. ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్‌గా బాలరాజు చేపడుతున్న కార్యక్రమాలు, పార్టీ పట్ల నిబద్ధత గల కార్యకర్తలు ఈసారి కూడా మున్సిపాలిటీని కైవసం చేసుకునే దిశగా కీలకంగా మారనున్నాయని కాంగ్రెస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. చైర్మన్ పదవి బాలరాజు అనుచరుడికే దక్కే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.మరోవైపు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో యువత పెద్ద సంఖ్యలో పోటీకి సై అంటోంది. కొత్త నాయకత్వం, అభివృద్ధి నినాదాలతో యువత రాజకీయాల్లోకి రావడానికి ఆసక్తి చూపుతుండటం ఈ ఎన్నికలకు మరింత ప్రాధాన్యం తీసుకొచ్చింది.

మొత్తంగా చూస్తే,
హిందూ ముస్లిం ఏకమైతే కమలానికి లాభమా?
కాంగ్రెస్‌లో అసంతృప్తులు
బీఆర్ఎస్ వ్యూహాత్మక ఎత్తుగడలు
పోచారం--కాసుల బాలరాజు క్యాడర్ బలం
ఈ నాలుగు అంశాలే బాన్సువాడ మున్సిపాలిటీలో విజయం ఎవరికి దక్కుతుందో తేల్చనున్నాయని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.
మున్సిపల్ చైర్మన్ కుర్చీ ఎవరి చేతికి చేరుతుందో అన్నది నోటిఫికేషన్ తర్వాత మరింత స్పష్టతకు రానుంది.

## సురక్షిత ప్రయాణమే లక్ష్యం - రోడ్డు భద్రతపై పోలీసుల అవగాహన

**కామారెడ్డి ప్రతినిధి జనవరి 13. (ప్రజాజ్యోతి)**
రోడ్డు ప్రమాదాలు తగ్గించి ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యాన్ని చేరాలనే లక్ష్యంతో (అరైవ్--అలైవ్) కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఆధ్వర్యంలో పోలీస్ కళాబృందం గ్రామస్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనంపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించవద్దని, నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించేటప్పుడు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిన అవసరాన్ని వివరించారు.
ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఎస్పీ బి. చైతన్య రెడ్డి, మాట్లాడుతూ, చిన్న పొరపాటు వల్ల కూడా అమూల్యమైన ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఒక్క ప్రమాదం జరిగితే కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.పోలీస్ కళాబృందం ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ రామచం తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ యు. శేషరావు, పీసీ సాయిలు మాటలు--పాటల ద్వారా ప్రజలను ఆకట్టుకునేలా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కామారెడ్డి రూరల్ సీఐ రామన్, ఎస్ఐలు రంజిత్, భువనేశ్వర్, ఎం.వి.ఐ.జె. శ్రీనివాస్, అసిస్టెంట్ ఎం.వి.ఐ., ఉగ్రవాయి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కాలుష్యం.. మన భవిష్యత్తుకు ముప్పు

కాలుష్యం తీవ్రంగా పెరిగింది. దీని ప్రభావంతో శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, గుండె జబ్బులు, అలర్జీలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు గాలి కాలుష్యానికి ఎక్కువగా గురవుతున్నారు.

నీటి కాలుష్యం జీవనాధారానికి గండం
కాలువల్లో పరిశ్రమల వ్యర్థాలు, పట్టణ మురుగు నీరు కలవడంతో నదులు, చెరువులు కలుషితమవుతున్నాయి. శుద్ధి చేయని నీటిని తాగడం వల్ల డయేరియా, టైఫాయిడ్, చర్మ వ్యాధులు విస్తరిస్తున్నాయి. నీటి కాలుష్యం వల్ల వ్యవసాయం కూడా దెబ్బతింటూ, ఆహార భద్రతకు ముప్పు ఏర్పడుతోంది.

**ప్లాస్టిక్ కాలుష్యం భూమికి భారంగా**
ఒక్కసారి ఉపయోగించి పడేసే ప్లాస్టిక్ వస్తువులు భూమిలో కుళ్లకపోవడంతో నేల సారాన్ని తగ్గిస్తున్నాయి. ప్లాస్టిక్ వల్ల పశుపక్షులు ప్రాణాలు కోల్పోతుండగా, చివరికి అదే మన ఆహార గొలుసులోకి చేరి మన ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తోంది.

**పరిష్కారం మన చేతుల్లోనే**
కాలుష్య నివారణకు ప్రభుత్వం మాత్రమే కాకుండా ప్రతి పౌరుడు బాధ్యత వహించాల్సిన అవసరం ఉంది.
వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గించి ప్రజా రవాణా, సైకిల్ వినియోగం పెంచాలి.
చెత్తను వేరు చేసి పారవేయాలి, చెత్తను కాల్చడం మానుకోవాలి. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ అనుకూల వస్తువులు ఉపయోగించాలి.చెట్లు నాటడం, ఉన్న చెట్లను సంరక్షించడం ద్వారా గాలి కాలుష్యాన్ని తగ్గించవచ్చు.నీటి వనరులను కలుషితం చేయకుండా కాపాడుకోవాలి.

**భవిష్యత్ తరాల కోసం ఈ రోజు నుంచే**
కాలుష్యాన్ని నియంత్రించకపోతే రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించలేము. ప్రకృతిని కాపాడుకోవడం అంటే మనల్ని మనమే కాపాడుకోవడం. శుభ్రమైన గాలి, స్వచ్ఛమైన నీరు, ఆరోగ్యకరమైన జీవనం అందాలంటే ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉంది.కాలుష్యానికి చెక్ పెట్టే బాధ్యత మన అందరిదే. ఇవాళ తీసుకునే చిన్న నిర్ణయాలే రేపటి సమాజాన్ని ఆరోగ్యంగా తీర్చిదిద్దుతాయి.

## గంజాయి వద్దు -గ్రౌండ్ ముద్దు అవగాహన కార్యక్రమం

**నిజామాబాద్ రూరల్: జనవరి, 13 (ప్రజా జ్యోతి)**
సిరికొండ మండలంలోని దుప్యతాండా గ్రామంలో మంగళవారం "గంజాయి వద్దు -- గ్రౌండ్ ముద్దు" అనే నినాదంతో అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ యువత కోసం కబడ్డీ టోర్నమెంట్‌ను నిర్వహించగా, క్రీడాభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ధర్పల్లి సీఐ భిక్షపతి, సిరికొండ ఎస్ఐ జె. రామకృష్ణ హాజరై మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి క్రీడలపై దృష్టి సారించాలని, క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కూడా పెరుగుతుందని తెలిపారు. క్రీడలే యువతను సరైన మార్గంలో నడిపించే శక్తివంతమైన సాధనమని అన్నారు.
అదే కార్యక్రమంలో రోడ్డు భద్రతపై "అరైవ్ అలైవ్ అనే ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన అవసరం, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల కలిగే ప్రమాదాలు వంటి అంశాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు.
ఈ కార్యక్రమంలో గ్రామ యువతతో పాటు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికలపై పోలీస్ కమిషనర్ సమీక్ష

నిజామాబాద్ రూరల్: జనవరి, 13 (ప్రజా జ్యోతి)
నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో త్వరలో జరగబోయే కార్పొరేషన్ మరియు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్ సోమవారం పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాబోయే కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమైనవని పేర్కొన్నారు. ఈ ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో పోలీస్ శాఖ పాత్ర ఎంతో ముఖ్యమని స్పష్టం చేశారు.ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి అధికారి, సిబ్బంది ఎన్నికల కోడ్‌ను కచ్చితంగా అమలు చేస్తూ, ఎటువంటి రాజకీయ ప్రభావాలకు లోనుకాకుండా పూర్తిస్థాయిలో నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, ముందస్తు చర్యలతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని సూచించారు.సామాన్య ప్రజలకు భద్రత, నమ్మకం కలిగేలా పోలీస్ చర్యలు ఉండాలని, ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించాలని, సోషల్ మీడియా ద్వారా వ్యాపించే వదంతులు, తప్పుడు ప్రచారాలను నియంత్రించడంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల సమయంలో శాంతి భద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యం కావాలని స్పష్టం చేశారు.ప్రతి అధికారి తన బాధ్యతను పూర్తిగా అవగాహన చేసుకుని, పరస్పర సమన్వయంతో, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో నిజామాబాద్ అదనపు డీసీపీ (అడ్మిన్) బి. బస్వారెడ్డి, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, ట్రాఫిక్ ఏసీపీలుగా రాజా వెంకటరెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్వర్ రెడ్డి, మస్తాన్ అలీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, సీసీఆర్‌బి ఇన్‌స్పెక్టర్ ఆర్. అంజయ్య, ఎలక్షన్ సెల్ ఇన్‌స్పెక్టర్ వీరయ్య, జిల్లాలోని సీఐలు, ఎస్‌హెచ్‌వోలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## బూత్ లెవల్ అధికారులకు బహుమతులు అందజేసిన సబ్ కలెక్టర్.



**బోధన్ జనవరి 13 (ప్రజాజ్యోతి)**
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) మ్యాపింగ్, ప్రోజెనీ అడిషన్ ప్రక్రియల్లో వారానికోసారి అత్యుత్తమ ప్రగతి సాధించిన బూత్ లెవల్ అధికారులు (బీఎల్వో)కు మంగళవారం సబ్ కలెక్టర్ వికాస్ మహతో బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల డేటాను ఖచ్చితంగా నవీకరించడం, ఫీల్డ్ స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంలో బీఎల్వోలు చూపిన అంకితభావం అభినందనీయమని ప్రశంసించారు. ప్రతి బీఎల్వో తన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. అలాగే, అందరు బీఎల్వోలు ఇదే ఉత్సాహంతో నిరంతరతను కొనసాగిస్తూ పనితీరును మరింత మెరుగుపరచుకోవాలని, ఎన్నికల ప్రక్రియలో తప్పులేని ఓటరు జాబితా సిద్ధం చేయడమే లక్ష్యంగా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్ళ అరెస్ట్

నిజామాబాద్ రూరల్: జనవరి, 13 (ప్రజాజ్యోతి)
మోపాల్ మండలం చిన్నాపూర్ గ్రామ శివారులో సోమవారం సాయంత్రం సుమారు 5.30 గంటలకు పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు మోపాల్ ఎస్ఐ జెడ్. సుస్మితా తన సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాటలో పాల్గొంటున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.17,100 నగదుతో పాటు 52 పేకల కార్డులను స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. అక్రమ జూద కార్యకలాపాలపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని, ప్రజలు ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ జెడ్. సుస్మితా పోలీస్ శాఖ తరఫున విజ్ఞప్తి చేశారు.

## టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో కార్యాలయ సముదాయంలో సంక్రాంతి ముగ్గుల కార్యక్రమం..





**కామారెడ్డి ప్రతినిధి జనవరి 13. (ప్రజాజ్యోతి)**
మంగళవారం టీఎన్జీవోస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు 2026 పురస్కరించుకుని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు నరాల వెంకటరెడ్డి అధ్యక్షతన కామారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయము ప్రాంగణంలో అన్ని శాఖల మహిళా ఉద్యోగులకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించబడినవి. ఇట్టి కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్లు విక్టర్ మధుమోహన్ ముఖ్య అతిథులుగా హాజరు కావడం జరిగింది.
ఇట్టి టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు 2026 కార్యక్రమంలో భాగంగా మహిళా ఉద్యోగులు వేసిన ముగ్గులకు గాను మొదటి బహుమతి శాంభవి, శాంతి విద్యా శాఖ వారికి, ద్వితీయ బహుమతినీ రోజా రాణి రవళి రెవెన్యూ శాఖ అదేవిధంగా గౌతమి అరుణ మత్స్యశాఖ వారు గెలుచుకోవడం జరిగినది. అదేవిధంగా తృతీయ బహుమతిని ప్రియాంక పద్మ ఆడిట్, చీఫ్ ప్లానింగ్ శాఖ పొందడం జరిగింది. టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు 2026 కార్యక్రమంలో పాల్గొన్న మహిళా ఉద్యోగుల ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ బహుమతి ఇవ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించడం ఆనందదాయకమని అదేవిధంగా మహిళా ఉద్యోగులు అన్ని రంగాల్లో ముందు ఉండి జిల్లా కార్యాలయాల్లో వారి పనులను సంతృప్తికరంగా నిర్వహించుకుని జిల్లాకు మంచి పేరును తీసుకురావాలని కోరడం జరిగినది.. అదేవిధంగా కార్యక్రమంలో పాల్గొన్న మహిళా ఉద్యోగులకు అభినందించి జిల్లా ఉద్యోగులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్ మాట్లాడుతూ టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా శాఖ ప్రతి సంవత్సరం ముగ్గుల పోటీలు నిర్వహించడం ఒక మంచి సాంప్రదాయమని మరియు ముగ్గుల పోటీలలో పాల్గొన్నటువంటి ఉద్యోగులకు అదేవిధంగా జిల్లా ఉద్యోగులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది..ఇట్టి కార్యక్రమంలో..జిల్లా అధ్యక్షులు నరాల వెంకట్ రెడ్డి..కార్యదర్శి ముల్క నాగరాజు..కోశాధికారి ఎం దేవరాజు..
ఉపాధ్యక్షులు రాజ్యలక్ష్మి ఎంసీ పోచయ్య మరియు..ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్ కుమార్..కల్చరల్ సెక్రటరీ రాజ్ కుమార్..ఈసీ నెంబర్లు సాయినాథ్, లక్ష్మణ్ మరియు దత్తాద్రి. అర్బన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి మరియు సృజన్..జిల్లా క్లాస్ ఫోర్ సంగం కార్యదర్శి మక్బూల్ మరియు వారి కార్యవర్గ సభ్యులు.. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయము మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు..

## అట్టహాసంగా నీరుడి రాజన్న క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం.

**నాగిరెడ్డిపేట్,జనవరి13(ప్రజాజ్యోతి):**
కాంగ్రెస్ నాయకుడు నీరుడి రాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నక్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ఉత్సాహంగా ప్రారంభమైంది. మండల కేంద్రంలోని మాల్తుమ్మెద విత్తనోత్పత్తి క్షేత్రంలో ఈ నెల 17 వరకు ఐదు రోజులపాటు పోటీలు జరుగనున్నాయి. ఈ క్రీడా పోటీలను ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత ప్రారంభించారు. ఈ టోర్నమెంట్ లో మొదటి బహుమతిగా రూ. 15,555/-,రెండవ బహుమతిగా రూ. 11,111/- అందించనున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యం కూడా కలుగుతుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ క్రీడలపై మక్కువతో ఉండాలని, అప్పుడే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా క్రీడల ద్వారా మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలనే సంకల్పంతో ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్న నీరుడి రాజు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు . ఈ క్రికెట్ టోర్నమెంట్ లో మొత్తం




30 జట్టులు ఆడనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి సిఐ రాజారెడ్డి,డిప్యూటీ తహశీల్దార్ రాజేశ్వర్,ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్,ఎస్సై భార్గవ్ గౌడ్,మండల ప్రధాన కార్యదర్శి దివిటీ కిష్టయ్య,కాంగ్రెస్ నాయకులు రాంచంద్ర రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,వెంకట్ రాంరెడ్డి,నర్సింహారెడ్డి, ఇమాం,సంజీవులు,సుధాకర్,మధు,గోపాల్ పెట్ గ్రామా ఉపసర్పంచ్ గులాం హుస్సేన్,చినూర్ గ్రామా సర్పంచ్ మురళి గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## పెయింట్ కంపెనీ వద్దంటూ ఎంపీడీవోకు వినతిపత్రం

**రాజంపేట జనవరి 13 (ప్రజా జ్యోతి)**
రాజంపేట మండల పరిధిలోని ఆరేపల్లి తండాలో గ్రామపంచాయతీ అనుమతి లేకుండా పెయింట్ కంపెనీ (వీ/ం పాను నూతన కంపెనీ) ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తండావాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు తండావాసులు మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) బాలకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తండావాసులు మాట్లాడుతూ, కంపెనీ ఏర్పాటుతో పెయింట్ రసాయనాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాల కారణంగా గాలి, నీరు, భూమి తీవ్రంగా కాలుష్యానికి గురవుతాయని, దీని వల్ల చిన్నారుల ఆరోగ్యం దెబ్బతిని పోలియో వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే కాలుష్య ప్రభావంతో పాడిపంటలు, పశువులు, వ్యవసాయ భూములు పూర్తిగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. గ్రామపంచాయతీ అనుమతి తీసుకోకుండా, ప్రజాభిప్రాయం పరిగణనలోకి తీసుకోకుండానే కంపెనీ నిర్మాణానికి ప్రయత్నించడం అన్యాయమని తండావాసులు మండిపడ్డారు. ఈ నేపథ్యంలో తండావాసులంతా ఏకగ్రీవంగా సమావేశమై పెయింట్ కంపెనీ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రామ్ సింగ్ నాయక్, రవీందర్, వినోద్, అనిల్, జివుల, మోహన్, మదన్ తదితరులు తండావాసుల డిమాండ్‌కు మద్దతు తెలిపారు. తక్షణమే ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని పెయింట్ కంపెనీ నిర్మాణానికి అనుమతులు రద్దు చేసి తమకు న్యాయం చేయాలని ఆరేపల్లి తండావాసులు ఎంపీడీవోను కోరారు.



## సర్పంచ్ శంకర్‌కు సన్మానం



**బాన్సువాడఆర్ సి/బీర్కూర్ జనవరి 13 ప్రజా జ్యోతి**
బీర్కూర్ మండలం దామరంచ నూతన సర్పంచ్ బోయిని శంకర్ ను. మండల కాంగ్రెస్ నాయకుడు మియ్యాపురం శశికాంత్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సర్పంచ్ ,ఉపసర్పంచ్ ఇంటెనుక శంకర్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో వార్డు సభ్యులు కూర్మ లక్ష్మణ్,మంగలి అంబాజీ, సత్యనారాయణ లు పాల్గొన్నారు.

## సంక్రాంతి పండుగ ముగ్గులు పంపిణీ చేసిన 39వ వార్డ్ ఇంచార్జ్ మహమ్మద్ ఆబిద్





**కామారెడ్డి ప్రతినిధి జనవరి 13. (ప్రజాజ్యోతి)**
కామారెడ్డి పట్టణంలోని 39వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మహమ్మద్ ఆబిద్ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటికి కలర్స్ పంపిణీ చేయడం జరిగింది. మహమ్మద్ అబీద్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన అన్నారు., పాడి పంటలు బాగా పండాలని, అలాగే 39 వ వార్డు ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు, ఈ కార్యక్రమంలో, మనోహర్, లత, సాజిత్, నిరంజన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## బైక్ అదుపు తప్పి..ఒకరికి తీవ్ర గాయాలు

**నాగిరెడ్డిపేట్,జనవరి13(ప్రజాజ్యోతి):**
నాగిరెడ్డిపేట మండలం బంజారా గ్రామం వద్ద జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పి దానిపై ప్రయాణిస్తున్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన ప్రకారం ఎల్లారెడ్డి మండలం భిక్కనూరు గ్రామానికి చెందిన గోనే నారాయణ తన ఎక్సెల్ బైక్ మీద మెదక్ జిల్లా నాగపురం గ్రామానికి వెళుతున్న క్రమంలో బంజారా వద్ద అదుపు తప్పి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అంబులెన్సుకు సమాచారం అందించడంతో పైలెట్ గణేష్, ఈఎంటి ప్రశాంత్ కుమార్ లు గాయపడిన వ్యక్తికి ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



# రోడ్డు, సైబర్ నేరాలపై రాజంపేట పోలీసుల అవగాహన

**రాజంపేట జనవరి 13 (ప్రజా జ్యోతి)**

రాష్ట్రంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజంపేట పోలీసులు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజలకు, యువతకు రోడ్డు భద్రతా నియమాలు, సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీఆర్బీ సీఐ మురళి మాట్లాడుతూ, రోడ్డు భద్రతే ప్రాణ రక్షణ అని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగంతో వాహనాలు నడపరాదని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే విలువైన ప్రాణాలు కాపాడుకోవచ్చని తెలిపారు. అలాగే సైబర్ నేరాలపై మాట్లాడుతూ, అపరిచిత వ్యక్తులకు బ్యాంక్ వివరాలు, ఓటీపీలు (ఒటిపి) ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పకూడదని హెచ్చరించారు. ఆన్‌లైన్ మోసాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సోషల్ మీడియా




వేదికలైన ఫేస్‌బుక్, వాట్సాప్ తదితరాల్లో వచ్చే అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని పోలీసులు సూచించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ద్వారా నేరాలను అరికట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఎస్సై రాజు, పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# 9వ వార్డులో పారిశుద్ధత పనులు ప్రారంభం



**రాజంపేట జనవరి 13 (ప్రజా జ్యోతి)**

రాజంపేట మండల కేంద్రంలోని 9వ వార్డులో పారిశుద్ధత పనులు ప్రారంభించారు. వార్డులో పేరుకుపోయిన మురికి కాలువల శుభ్రత, చెత్త తొలగింపుతో పాటు తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. వార్డులో తీవ్ర తాగునీటి కొరత ఉందని సమాచారం అందగానే పద్మ బాల్ నర్సు వెంటనే స్పందించి "నేనున్నానంటూ" ముందుకు వచ్చి మంగళవారం మంచి నీటి కనెక్షన్ మంజూరు చేయించి ప్రజల మన్ననలు పొందారు. ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గమనించిన గ్రామ సర్పంచ్ దుబ్బని శ్రీకాంత్, పద్మ బాల్ నర్సుతో పాటు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని తక్షణ చర్యలు తీసుకున్నారు. దీంతో తాగునీటి కనెక్షన్ మంజూరై ప్రజలకు ఊరట కలిగింది. ఈ సందర్భంగా పాలికులు మాట్లాడుతూ, "వార్డులో ఏ సమస్య ఉన్నా ముందుగా స్పందించి



పరిష్కరిస్తున్న పద్మ బాల్ నర్సు సేవలు అభినందనీయమైనవి" అని ప్రశంసించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నానని, పారిశుద్ధత, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలపై ఎప్పటికప్పుడు దృష్టి పెట్టి చర్యలు తీసుకుంటామని పద్మ బాల్ నర్సు తెలిపారు.

# వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలి

## సదాశివనగర్ సిఐ సంతోష్ కుమార్

**సదాశివనగర్ జనవరి 13 (ప్రజాజ్యోతి)**

వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలని సదాశివనగర్ సిఐ సంతోష్ కుమార్ అన్నారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా అరైవ్ - ఆలైవ్ కార్యక్రమాన్ని చేపట్టింది. తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ పోలీస్ శివధర్‌రెడ్డి, కామారెడ్డి జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు సదాశివనగర్ మండల కేంద్రంలో వాహనదారులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదల నివారణ గురించి, ద్విచక్ర వాహనదారులు వాహనాలను నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని, మొబైల్ ఫోన్లో మాట్లాడరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. ప్రతి వాహన దారుడు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించి క్షేమంగా ఇంటికి చేరుకోవాలని సూచించారు.



ఈ కార్యక్రమంలో సదాశివ నగర్ సర్పంచ్ వంకాయల శిరీష-రవి, ఎస్సై2సిద్ధికి, ఏఎస్ఐ జగదీష్, ఉప సర్పంచ్, పాలక మండలి సభ్యులు, పోలీసులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ తరగతులు

**నాగిరెడ్డిపేట్,జనవరి13(ప్రజాజ్యోతి):**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో గ్రామ సంఘం అధ్యక్షులకు,సహాయకులకు మంగళవారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యక్రమంలో శిక్షణ తరగతులు నిర్వహించారు.ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల్లోని 18 నుండి 50 సంవత్సరాలలోపు మహిళలందరూ అక్షర జ్ఞానం తెలిసి ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఏ విధంగా నిర్వహించాలి అనే విషయమై సిఆర్పిలు దుర్గ,సంగీత మరియు ఏపీఎం రాంనారాయణ గౌడ్ లు శిక్షణ తరగతులు ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘంలోని ప్రతి మహిళకు అక్షరం నేర్పించాలి అనేది తమ లక్ష్యమని,ప్రతి మహిళా అక్షరాస్యులుగా ఉండాలని సంకల్పించుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని,చదువు నేర్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్,సిసిలు దత్తు,రమేష్,నారాయణ,రషీద్, రవి అకౌంటెంట్ రాజు,ఆపరేటర్ రవి తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పథంలో మహిళలు



**భిక్కనూరు,జనవరి 13 (ప్రజాజ్యోతి)**

భిక్కనూరు మండల సమైక్య కార్యాలయంలో ఏపీఎం సాయిలు ఆధ్వర్యంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 100% బ్యాంకు లింకేజీ ప్రగతి సాధించినందుకు సీసీ లందరినీ అభినందించడం జరిగింది. అలాగే మండలంలో 20 గేదెలు టార్గెట్ ఉన్నందున ఈ 20 గేదెలను శ్రీనిధి నుండి మహిళ సంఘాల సభ్యులకు ఇప్పించాలని తెలపడం జరిగింది. పి ఎం ఎఫ్ ఎం ఈ యూనిట్స్ 11 పెట్టించాలని తెలపడం జరిగింది పుస్తక నిర్వహణ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సూచించారు. మహిళా అభివృద్ధి కొరకు ప్రభుత్వం చేపడుతున్న కొత్త కొత్త పథకాలను మహిళా సంఘాల సభ్యులందరూ సద్వినియోగం చేసుకొని, మహిళా సాధికారత దిశగా అడుగులు వేస్తూ,స్వశక్తిపై నిలబడేందుకు మహిళలకి గొప్ప అవకాశం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీలు, బాలచంద్రం, వెంకటేశం,శ్రీనివాస్, స్వాతి లు పాల్గొన్నారు.

# ముగ్గుల పోటీలను పరిశీలించిన ఏ.ఎస్.పి



**బిక్కనూరు, జనవరి 13 (ప్రజాజ్యోతి)**

భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామంలో సర్పంచ్ వాణి వాసు యాదవ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ పోటీ ఈ పోటీలను ఏ. ఎస్. పి. చైతన్య రెడ్డి పరిశీలించి బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రకాష్ గౌడ్, బిక్కనూరు సిఐ సంపత్ కుమార్, ఎస్ఐ ఆంజనేయులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారంలో చురుకుగా

**బిక్కనూరు, జనవరి 13 (ప్రజా జ్యోతి)**

భిక్కనూరు మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామంలో గ్రామ సర్పంచ్ కోడూరు సాయ గౌడ్ ఆధ్వర్యంలో 12వ వార్డు మసులవాడలో కొత్త మోటర్ బిగించడం జరిగింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు గ్రామంలో ఎటువంటి సమస్య లేకుండా చేసేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తానని సాయ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ చైతన్య కొండల్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ స్వామి, వార్డు మెంబర్స్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



# రోడ్డు నిబంధనలు పాటిస్తేనే ప్రాణరక్షణ సాధ్యం : ఎస్ఐ శివకుమార్

**నిజాంసాగర్ ప్రజా జ్యోతి జనవరి 13**

మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదస్సులో ఎస్ఐ శివకుమార్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిబంధనలు పాటించడం ద్వారానే విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని స్పష్టం చేశారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం వల్ల ఎక్కువగా ప్రాణనష్టం జరుగుతోందని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ పెట్టుకోవడం ద్వారా ప్రమాద తీవ్రతను తగ్గించుకోవచ్చని తెలిపారు. అతివేగం వద్దని, నిర్ణీత వేగ పరిమితులను తప్పక పాటించాలని సూచించారు.

మద్యం సేవించి వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమని, ఇది ఆత్మహత్యతో సమానమని ఎస్ఐ శివకుమార్ తీవ్రంగా హెచ్చరించారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం వల్ల కేవలం డ్రైవర్‌కే కాకుండా రోడ్డుపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడుతుందని తెలిపారు. ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు సూచికలు, నిబంధనలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, పోలీసులు విధించే జరిమానాల కంటే ప్రాణాలే ముఖ్యమని అన్నారు. ప్రజల సహకారంతోనే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని, ప్రతి




ఒక్కరూ బాధ్యతాయుత పౌరులుగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా వాహనదారుల్లో భద్రతపై అవగాహన పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# రహదారి భద్రత నియమాలను ప్రతీ ఒక్కరు పాటించాలి

## హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి: బీబీపేట ఎస్ ఐ కొండా విజయ్

**బీబీపేట్ మండల్ ప్రజా జ్యోతి జనవరి 13**

బీబీపేట మండల కేంద్రంలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా బీబీపేట పోలీసు అధికారులు ఆధ్వర్యంలో మంగళవారం రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చౌరస్తా వద్ద చేరుకున్నారు .ఈ సందర్భంగా బీబీపేట ఎస్ ఐ కొండా విజయ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించుకుని తల్లిదండ్రులు, సమాజానికి కూడా అవగాహన కల్పించాలని తెలిపారు. హెల్మెట్ వినియోగం తప్పనిసరిగా చేయాలని కోరారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు తగ్గినట్లు తెలిపారు. ఈ సంఖ్య మరింత తగ్గేలా అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా



ధరించాలని సూచించారు. హెల్మెట్, సీట్‌బెల్ట్‌తో పాటు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తేనే ప్రాణ రక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెట్టినట్లవుతుందని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మరీ మరీ తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో బీబీపేట ఎస్ ఐ కొండా విజయ్ మరియు పోలీస్ సిబ్బంది మరియు సర్పంచ్ ఎదుల్ల సాద్విక సాయి మరియు వివిధ పార్టీల నాయకులు, పుర ప్రముఖులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల కొరకు అవగాహన

**--అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి, ఎస్సై పి.రాజశేఖర్**



**రామారెడ్డి జనవరి 13 (ప్రజాజ్యోతి)**

రామారెడ్డి మండల కేంద్రంలో పాఠశాల ఆవరణంలో పోలీస్ శాఖ ద్వారా తెలంగాణ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు మరణాలు తగ్గించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమంలో భాగంగా రామారెడ్డి ప్రజలకు అవగాహన కార్యక్రమం లో స్థానిక ఎస్సై పి రాజశేఖర్, కామారెడ్డి జిల్లా అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమంలో పాల్గొని యువతకు గ్రామ ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్




పెట్టుకోవాలని, తాగి వాహనాలు నడపకూడదని, రాంగ్ రూట్లో నడపకూడదని, సెల్ఫోన్ వాడుతూ నడపకూడదని, కారులో ప్రయాణించేటప్పుడు అందరూ సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, మైనర్లు డ్రైవింగ్ చేయకూడదని, సిగ్నల్ జంపింగ్, స్టాప్ లైన్ దాటడం, ఆటోలో ఓవర్ లోడింగ్, ఎడమవైపు నుంచి ఓవర్టేక్ చేయడం ఇలా పలు అంశాలపై అవగాహన కల్పించడం, తదుపరి ఇట్టి కార్యక్రమంలో రామారెడ్డి సర్పంచ్ బండి ప్రవీణ్ కుమార్ ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు అడిషనల్ ఎస్పీ నరసింహ రెడ్డి, పోలీస్ సిబ్బంది. యువకులు తదితరులు పాల్గొన్నారు.

## నడమి తండాలో రహదారుల మరమ్మత్తులు

**రాజంపేట జనవరి 13 (ప్రజా జ్యోతి)**

రాజంపేట మండల పరిధిలోని నడమి తండా గ్రామంలో గత సంవత్సరం ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షాలకు రహదారులు పూర్తిగా దెబ్బతిని అష్టదిశలుగా మారాయి. రోడ్లపై ఏర్పడిన గుంతల వల్ల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ పరిస్థితిని గమనించిన గ్రామ సర్పంచ్ లక్ష్మి షేర్ సింగ్, ఉపసర్పంచ్ సునీత రమేష్ ఆధ్వర్యంలో నూతన పాలకవర్గం మంగళవారం గ్రామంలో రహదారి మరమ్మత్తు పనులు చేపట్టింది. దెబ్బతిన్న రోడ్లపై మొరంపోసి, గుంతలు పూడ్చి రహదారులను శుభ్రం చేస్తున్నారు. గ్రామంలో రహదారులు సజావుగా ఉండేలా చర్యలు తీసుకుంటూ ప్రజలకు, వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు పాలకవర్గం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## యువకులకు క్రికెట్ కిట్లు పంపిణీ



**రాజంపేట జనవరి 13 (ప్రజా జ్యోతి)**

రాజంపేట మండలం పరిధిలోని ఆరేపల్లి తండా యువకులకు మంగళవారం నూతనంగా ఎన్నికైన సర్పంచ్ పాట్లే రోజా కృష్ణారావు క్రికెట్ కిట్లు అందజేశారు. గ్రామ యువతను క్రీడల వైపు ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రోజా కృష్ణారావు మాట్లాడుతూ, “మేము అందిస్తున్న ఈ క్రికెట్ కిట్లను గుర్తింపుగా తీసుకొని మీరు ఆడే ఆటల ద్వారా మన గ్రామానికి మంచి పేరు రావాలి. క్రీడల్లో ముందుకు వెళ్లి గ్రామ గౌరవాన్ని పెంచాలని” యువకులను మనస్ఫూర్తిగా అభినందించారు. యువత క్రీడలతో పాటు క్రమశిక్షణ, ఐక్యతను అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అన్వేష్, వార్డ్ సభ్యులు, గ్రామ పెద్దలు, తండా యువకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామ యువకులు మాట్లాడుతూ, తమకు క్రీడా సామగ్రి అందించిన సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, గ్రామానికి మంచి గుర్తింపు తీసుకొచ్చేలా కృషి చేస్తామని తెలిపారు.

## 13వ వార్డులో వాటర్ కుండీ క్లీనింగ్



**రామారెడ్డి జనవరి 13 (ప్రజాజ్యోతి)**

రామారెడ్డి మండల కేంద్రంలోని 13వ వార్డును గ్రామ సర్పంచ్ బండి ప్రవీణ్ కుమార్ ఉదయం పర్యవేక్షించారు. వార్డులోని సమస్యలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకోవడం జరిగింది. అదేవిధంగా వార్డు సభ్యుడు ఇస్సాయిపేట్ హరీష్ బాధ్యతాయుతంగా వార్డులోని శిథిలావస్థలో ఉన్న నీటి కుండీని పర్యవేక్షించి స్వయంగా తానే మరమ్మత్తుల కొరకు చర్యలు తీసుకోవడం జరిగింది. ఈ విషయంలో వాడు సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఇలాంటి సర్పంచ్,ను వార్డు సభ్యుడు హరీష్ ను ఎన్నుకున్న అందుకు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## ఎల్లారెడ్డిపల్లిలో ప్రజా బాట కార్యక్రమం

**రాజంపేట జనవరి 13 (ప్రజా జ్యోతి)**

ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో ప్రజా బాట కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్తు ప్రమాదాలు, భద్రతా చర్యలు మరియు గ్రామంలో ఉన్న వివిధ విద్యుత్ సమస్యలపై చర్చించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ వినియోగంలో భద్రతా నియమాలు పాటించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, విద్యుత్ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో ఎదురవుతున్న విద్యుత్ సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.



# పేరు గొప్ప ఊరు దిబ్బగా మారిన గుండారం







**రాజంపేట జనవరి 13 (ప్రజా జ్యోతి)**

రాజంపేట మండల పరిధిలోని గుండారం గ్రామం పేరు గొప్పగా ఉన్నప్పటికీ, వాస్తవ పరిస్థితి మాత్రం దిబ్బగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వచ్చే కేంద్రంగా ఉన్న గుండారం గ్రామంలో బస్టాండ్, వద్ద వారం మార్కెట్, విద్యాసంస్థలు, ఆర్టీసీ బస్సు సౌకర్యాలు ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రధానంగా కామారెడ్డి--మెదక్ ప్రధాన రహదారిపై ఉన్న బస్టాండ్ వద్ద ప్రతి వారం సంత కొనసాగుతుంది. అయితే బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో మురికి కాలువల నుంచి మురుగు నీరు రోడ్డపైకి రావడంతో ప్రయాణికులు, మార్కెట్ వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీటిని దాటుతూ వెళ్లాల్సిన పరిస్థితి ఉండటంతో విద్యార్థులు, వృద్ధులు, చిన్నారులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామంలోని పల్లె దవాఖాన చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ మురుగు నీరు నిలిచిపోవడంతో రోగులు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా ఉండటంతో ఎక్కడ చూసినా చెత్తచెదారం పేరుకుపోయి, గ్రామంలో పారిశుధ్య లోపం స్పష్టంగా కనిపిస్తోంది. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అయినా గ్రామం శుభ్రంగా మారుతుందనే ఆశతో ప్రజలు ఎదురుచూసినా, పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదని వాపోతున్నారు. గ్రామంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్, పాలకవర్గం ఏర్పడినప్పటికీ ఇప్పటివరకు పారిశుధ్య పనులు చేపట్టకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంటువ్యాధులు ప్రబలుతాయేమోనన్న భయంతో ప్రజలు వణికిపోతున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టి, మురుగు కాలువలను శుభ్రం చేసి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని గుండారం గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# అయ్యప్ప శబరిమల తిరువాభరణ సేవలో గాంధారి వాసులు

**గాంధారి జనవరి 13(ప్రజాజ్యోతి)**

గాంధారి మండల కేంద్రం కు చెందిన ఈసారి శబరిమల అయ్యప్ప స్వామికి అలంకరించే తిరువాభరణ సేవలో ప్రత్యేక అవకాశం పొందారు. కామారెడ్డి జిల్లాకు చెందిన కులకర్ణి చక్రధర్, అంజాగౌడ్ స్వామి, కొక్కొండ మహేశ్వర్, రాజేశ్వర్ తిరువాభరణ సేవలో పాల్గొనే అదృష్టాన్ని పొందారు.తిరువాభరణ పాదయాత్ర జనవరి 12 నుండి 14 వరకు కొనసాగుతోంది. ప్రతి సంవత్సరం సంక్రాంతి రోజున శబరిమల అయ్యప్ప మకర సంక్రాంతి సందర్భంగా మూడు సార్లు జ్యోతి రూపంలో దర్శనం ఇస్తారు. పందలం రాజ్యం నుంచి తిరువాభరణాలను సుమారు 80 కిలోమీటర్లు కాలినడకన శబరిమల వరకు తీసుకు వచ్చి స్వామికి అలంకరిస్తారు. ఈ పాదయాత్రలో పందల రాజ వంశీయులు ప్రతి సంవత్సరం కొందరికి ప్రత్యేక అవకాశం కల్పిస్తారు.ఈసారి మొత్తం సుమారు 4,000 మంది భక్తులకు తిరువాభరణ సేవలో పాల్గొనడం అవకాశం కల్పించబడింది. దేశవ్యాప్తంగా వేలల్లో దరఖాస్తులు వచ్చినప్పటికీ, కామారెడ్డి జిల్లా నుండి నాలుగురికి అదృష్టం లభించింది.ఈ సందర్భంగా భక్తులు చక్రధర్, అంజాగౌడ్ స్వామి, మహేశ్వర్, రాజేశ్వర్ మాట్లాడుతూ, ఎన్నో జన్మల పుణ్య ఫలితాల కారణంగా ఈ అవకాశం లభించిందని తెలిపారు. అలాగే, పందల రాజు, నాచారం పిఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ మధుసూధానానంద సరస్వతి స్వామి, మరియు శాస్త్రి అన్నదాన సేవా సమితి ట్రస్ట్ అధ్యక్షులు గుడిపాటి చంద్రశేఖర్ శర్మ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.భక్తులు, ఈ పవిత్ర సన్నిధిలో పాల్గొనడం జీవితంలో ఒక ప్రత్యేక ఆధ్యాత్మిక అనుభవం అని వ్యక్తం చేశారు



## బంజార స్నేహితుల ఆత్మీయ సమ్మేళనంలో స్థానిక సేవకులను సన్మానం

**గాంధారి జనవరి 13(ప్రజాజ్యోతి)**

గాంధారి మండల కేంద్రంలో మంగళవారం బంజార స్నేహితులు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో స్థానిక సేవకులు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, గవర్నమెంట్ ఉద్యోగులు తదితరులను గౌరవించిన కార్యక్రమం ఘనంగా జరిగింది.కార్యక్రమంలో సర్పంచ్ సోమారం తండా తమ్ముడు మాలోత్ సుమిత్ర సంతోష్ బదాని వినోద్, పర్మాల తండా సర్పంచ్ కొడుకు సర్దార్ చందర్, ఉపసర్పంచ్ రాథోడ్ నెహ్రూ, బన్సీ సింగ్ దేవుసోత్ మరియు జాబ్ చేస్తున్న ఇతరులుకు మర్యాదపూర్వక సన్మానం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జూనియర్ లెక్చరర్ కేతావత్ రమేష్, పీటీ ఛత్రు, ధారావాత్ మోజీరామ్, నాందేవ్, లావుడ్య శీను, డి. శీనివాస్, యూత్ అధ్యక్షులు బాణపూర్ గోపి, కాటేవాడి సంతోష్, మోతి, ప్రకాష్, కే పందరి, కే వికాస్, బంటి, యం. శీను, రాజు, సంతోష్ గొల్లాడి తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా స్థానికులు సేవా వైభవాన్ని గుర్తించి, సమాజంలో ఐక్యత మరియు సాన్నిహిత్యం కల్పించడానికి స్నేహితులంతా కలిసి ప్రయత్నిస్తున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు.



## ఆర్ పి ఎల్ రామారెడ్డి క్రికెట్ మ్యాచ్






**రామారెడ్డి జనవరి 13 (ప్రజాజ్యోతి)**

రామారెడ్డి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఆర్పిఎల్ క్రికెట్ మ్యాచ్ స్థానిక జెడ్పిహెచ్ఎస్ హై స్కూల్ పాఠశాల ఆవరణ లో నిర్వహిస్తున్నారు.ఈ మ్యాచ్ రామారెడ్డి ప్రీమియర్ లీగ్యు సెషన్ - 6 2026 సీనియర్ మ్యాచ్ బుధవారం రంగు రానా టైగర్స్ వర్సెస్ డిష్ రవి రేంజర్స్ మధ్య ఉదయం 12:00 నిమిషాలకు ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. యువత క్రీడలతో మానసిక ఉల్లాసాన్ని పొందుతారని ఈ యొక్క అవకాశాన్ని ప్రతి ఒక్క యువకుడు,ఆటల పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. ముఖ్యంగా నేడు నిర్వహించే సీనియర్స్ క్రికెట్ మ్యాచ్ ఈ యొక్క మ్యాచ్ వీక్షించడానికి అందుబాటులో లేని వారి సౌకర్యార్థం ఇంస్టాగ్రామ్, ఫేస్బుక్, యూట్యూబ్ లాంటి వాటి ద్వారా లైవ్ టెలికాస్ట్ నిర్వహిస్తున్నారు. క్రికెట్ ప్రాంచెస్ టీం లీడర్స్, యువజన సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఈ యొక్క క్రికెట్ మ్యాచ్ ని ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో జర్నలిస్టు మృతి



**బాన్సువాడ ఆర్ సి జనవరి 13 (ప్రజా జ్యోతి)**

బాన్సువాడ మున్సిపాలిటీలోని దశపేట గ్రామానికి చెందిన దేవా సక్సేన జర్నలిస్ట్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. సంగారెడ్డి జిల్లా జోగిపేట్ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. 'ప్రజాగళం' పత్రికకు విలేకరిగా పనిచేస్తున్న దేవా సక్సేనా బాన్సువాడ మండలం దేశాయిపేటలో నివాసముంటున్నారు. హైదరాబాద్ నుంచి మంగళవారం బాన్సువాడకు వస్తుండగా జోగిపేట్ వద్ద బైక్ అదుపుతప్పగా దేవా సక్సేనా కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన అకాల మరణంతో జర్నలిస్టు వర్గాల్లో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తమైంది. దేవా సక్సేనా మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.

## ఇందిరమ్మ నూతన ఇళ్లకు ముగ్గు

### -సర్పంచ్ బండి ప్రవీణ్

**రామారెడ్డి జనవరి 13 (ప్రజాజ్యోతి)**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పథకంలో భాగంగా ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు కల నెరవేరేందుకు చేపట్టిన కార్యక్రమంలో భాగంగారామారెడ్డి మండల కేంద్రంలోని రాజమ్మ తండా లో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారునికి అదేవిధంగా హరిజనవాడలోని ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు మంగళవారం గ్రామ సర్పంచ్ బండి ప్రవీణ్ కుమార్, ఉపసర్పంచ్ నవీన్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నామాల రవి, ఏఎంసీ డైరెక్టర్ రావుఫ్, అమ్ముల పశుపతి, రామ్ సింగ్,చింతకుంట భాస్కర్,పిప్పరి లింబాద్రి, ఇసాయిపేట్ హరీష్, సెక్రటరీ ప్రశాంత్, తోకల శ్రీధర్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## బిచ్కుందలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు శంకుస్థాపనలు





**జుక్కల్ ఆర్సి ప్రజా జ్యోతి జనవరి 13**

బిచ్కుంద మున్సిపాలిటీ పరిధిలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ఘనంగా శంకుస్థాపనలు చేశారు. పట్టణంలోని వివిధ కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధి లక్ష్యంగా ఈ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కల్వర్టుల నిర్మాణం, వరద నీటి నివారణ పనులు, మురికి నీటి కాలువల నిర్మాణం, అంతర్గత సీసీ రోడ్ల ఏర్పాటు వంటి కీలక మౌలిక సదుపాయాల పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఈ పనులు పూర్తయితే పట్టణ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు. సుమారు రూ. 15 కోట్ల వ్యయంతో ఈ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు పెద్దపీట వేయాలని, నిర్ణీత గడువులో వేగవంతంగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు సేవలందిస్తున్న మున్సిపల్ సిబ్బందికి ఎమ్మెల్యే యూనిఫార్మ్‌లను అందజేశారు. ప్రజా సేవలో ముందుండే సిబ్బందికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక మండల నాయకులు మరియు పెద్ద సంఖ్యలో పట్టణ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## గ్రామ నూతన పాలకవర్గానికి సన్మానం



**రామారెడ్డి జనవరి 13 (ప్రజాజ్యోతి)**

రామారెడ్డి మండల కేంద్రంలోని అన్నారం గ్రామంలో నూతన సర్పంచ్ లత శ్రీనివాస్,ఉప సర్పంచ్ దయానంద్,పాలక వర్గానికి గ్రామంలోని డ్వాక్రా మహిళా సంగం సభ్యులు, డ్వాక్రా సిసి శ్రీనివాస్, వివో ఏ, ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో మద్దికుంట లావణ్య, పద్మ,భవాని, లావణ్య, గ్రామసంగం అధ్యక్షురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

## ఇస్రోజీవాడి క్రికెట్ టోర్నమెంట్ కార్యక్రమంలో పాల్గొన్న టి పి సి సి స్టేట్ జనరల్ సెక్రెటరీ




**కామారెడ్డి రూరల్ జనవరి 13 ప్రజా జ్యోతి**

కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముఖ్య అతిథులుగా విచ్చేసిన టిపిసిసి స్టేట్ జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు ఈ సందర్భంగా గడ్డం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ యువత క్రీడలపై మక్కువ పెంచుకోవాలని అప్పుడే మానసిక శేరీరక ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు యువతతో క్రీడ స్ఫూర్తిని పెంచేందుకు ఈలాంటి టోర్నమెంట్లు మరిన్ని ఏర్పాటు చేయాలని ఎల్లవేళలా మీకు నా సహాయ సహాకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో తాజా మాజా కౌన్సిలర్ జూలూరు సుధాకర్ చాట్ల వంశీ గడ్డమీద మహేష్ గౌరు నవీన్ కుమార్ కామారెడ్డి అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ప్రణీత్ అజిత్ నవీన పాల్గొన్నారు

# మహిళల్లో చైతన్యం పెంపునకు ముగ్గుల పోటీలు







**ఎల్లారెడ్డి, జనవరి -13(ప్రజా జ్యోతి )**

మహిళల్లో చైతన్యం పోటీతత్వ పెంపునఅబశ్రీశ్రీకు ముగ్గుల పోటీలు దోహఅబశ్రీశ్రీదం పడుతుందని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణంలోని బస్ డిపో ప్రాంగణంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించగా భారీ ఎత్తున మహిళలు, యువతులు ఈ ముగ్గుల పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అందమైన రంగు రంగుల ముగ్గులతో అలరించారు. ముగ్గుల పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పట్టుచీరలు అందజేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూౌ ప్రజలు సంక్రాంతి పండుగను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని సూచించారు. తెలంగాణలో సంక్రాంతి పండగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ముఖ్యంగా మహిళలు తమ ఇళ్ళ ముందర పండగ పూట రంగురంగులతో కూడిన అందమైన ముగ్గులు వేసి పండగను జరుపుకుంటారని అన్నారు. యువకులు పతంగులు ఎగురవేస్తూ పండగను జరుపుకుంటారని, అలాంటి సంక్రాంతి పండుగ అందరి జీవితాలు వెలుగులు నింపాలని ఆయన కోరుకున్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని మహిళ అభివృద్ధి దేశ అభివృద్ధి దారితీస్తుందన్నారు. ముగ్గుల పోటీల్లో పట్టణ గ్రామీణ మహిళలు యువతులు పెద్ద సంఖ్యల పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసిలు తానాజీరావు, మనోహర్ రెడ్డి,జలంధర్ రెడ్డి, ఆదిమూలం సతీష్, ఏగుల నర్సింలు, పృథ్వీరాజ్, మనోజ్, మూదాం సాయిలు, అరవింద్ గౌడ్, భర్కత్, దయాకర్ పాల్గొన్నారు.

## గాంధారి మండలాన్ని కామారెడ్డి రెవెన్యూ డివిజన్‌లో కలపాలి

### బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ మచ్చర్ల శ్రీకాంత్

**గాంధారి జనవరి 13(ప్రజాజ్యోతి)**

గాంధారి మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో బిజెపి జిల్లా కౌన్సిల్ మెంబర్ మచ్చర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ, గాంధారి మండలాన్ని కామారెడ్డి రెవెన్యూ డివిజన్‌లో కలపడం రాష్ట్ర ప్రభుత్వ పునర్వ్యవస్థీకరణలో అవసరమని గుర్తించారు. అసలు, గాంధారి మండలం గతంలో పునర్వ్యవస్థీకరణలో నిత్య నాయకుల నిర్ణయాలతో ఇతర డివిజన్‌లో కలిపిన కారణంగా, స్థానిక ప్రజలకు జిల్లా కేంద్రం 30 కిలోమీటర్లు, డివిజన్ కేంద్రం 35 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. ఇది ప్రజలకు అసౌకర్యం కలిగిస్తోంది అని శ్రీకాంత్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ చొరవ తీసుకొని, ప్రజల కోరిక మేరకు గాంధారి మండలాన్ని కామారెడ్డి రెవెన్యూ డివిజన్‌లో కలపాలని ఆయన తెలిపారు. దీని ద్వార గాంధారి మండల ప్రజలకు సౌకర్యం, ప్రభుత్వ సేవలకు చేరిక, మరియు పరిపాలనా సమర్థత పెరుగుతుందని, స్థానికులు ఎదురుచూస్తున్నారని ఆయన పేర్కొన్నారు.



## అధ్యాపకుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

**కామారెడ్డి ప్రతినిధి జనవరి 13 (ప్రజాజ్యోతి)**

కామారెడ్డి పట్టణంలో జరిగిన తెలంగాణ ప్రభుత్వ అధ్యాపకుల సంఘం యొక్క క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ అధ్యాపకుల సంఘం యొక్క క్యాలెండర్ ఆవిష్కరించడం జరిగింది. జిల్లా నోడల్ ఆఫీసర్ షేక్ సలాం పాల్గొన్నారు. దీనికి జిల్లా అధ్యక్షులు నీలంనర్సింహులు,జిల్లా ప్రధాన కార్యదర్శి టి. రమేష్ రావు, అలాగే జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. రమేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అంబీర్ శ్రీనివాస్ రావు,జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎం. నరసింహరాజు, తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు భద్రత నియమాలను ప్రతీ ఒక్కరు పాటించాలి

## -ఎల్లారెడ్డి సిఐ రాజారెడ్డి

**నాగిరెడ్డిపేట్,జనవరి13(ప్రజాజ్యోతి):**
రోడ్డు భద్రత నియమాలను ప్రతీ ఒక్కరు పాటించాలని ఎల్లారెడ్డి సిఐ రాజారెడ్డి పేర్కొన్నారు.మంగళవారం మండలంలోని నాగిరెడ్డిపేట్ గ్రామంలో అరైవ్,అలైవ్ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు రోడ్డు భద్రత నియమాలను అవగాహనా కల్పించారు.ద్విచక్ర వాహనంపై ప్రయాణించేప్పుడు వాహనాన్ని నడిపే వ్యక్తి తో పాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ను ధరించాలని,వేగ పరిమితిని పాటించాలన్నారు.మద్యం తాగి వాహనాన్ని నడపరాదని,మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. వాహనాలు నడిపేవ్యక్తి తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు.మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దన్నారు. రోడ్డు ప్రమాదాలకు వాహనదారుల భద్రత అవగాహన లోపం, అతివేగం ఒక



కారణమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాగిరెడ్డిపేట ఎస్సై భార్గవ్ గౌడ్,గ్రామా సర్పంచ్ మన్నే వెంకటి,కాంగ్రెస్ పార్టీ నాయకుడు నర్సింహా రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# సురక్షితంగా గమ్యాన్ని చేరండి

## జిల్లా పోలీస్ సూపరిండెంట్ రాజేష్ చంద్ర కార్యక్రమంలో పాల్గొన్న ఉగ్రవాయి సర్పంచ్ మహేష్ గౌడ్




**కామారెడ్డి రూరల్ జనవరి 13 ప్రజా జ్యోతి**
కామారెడ్డి జిల్లా ఉగ్రవాయి గ్రామంలో సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీ.ఎం.రాజేష్ చంద్ర ఐ.పీ.ఎస్ ఆధ్వర్యంలో పోలీస్ కళాబృందంచే అవగాహనా కార్యక్రమం ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించడం డ్రైవింగ్ చేసేటప్పుడు మొబైల్ ఫోన్ ఉపయోగించవద్దు నాలుగు చక్రాల వాహనంలో ప్రయాణించేటప్పుడు ఎల్లప్పుడూ సీట్ బెల్ట్ ధరించడం మద్యం సేవించి వాహనం నడపవద్దంటూట్రాఫిక్ నియమ నిబంధనలను




పాటించాలని ఏ ఎస్ పి మాట్లాడుతూ చిన్న పొరపాటు వల్ల మన నిండు ప్రాణాలు పోతాయనీ తెలియజేసినారు సురక్షత ప్రయాణం చేసి గమ్యం చేరాలని ఒక్కసారి ఆక్సిడెంట్ జరిగితే మన కుటుంబం పెద్దదిక్కును కోల్పోతుందని రోడ్డు ప్రమాదాలు తగ్గించి మనం అందరికి ఆదర్శంగా నిలవాలని గ్రామవాసులు అందరికీ కూడా ఎస్పీరాజేష్ చంద్ర వివరించినారూ పోలీస్ కళాబృందం ఇన్చార్జి హెడ్ కానిస్టేబుల్.రామంచ తిరుపతి హెడ్ కానిస్టేబుల్ యు.శేషరావు పిసి. సాయిలు.మాటలు పాటలు ద్వారా కార్యక్రమం చేయడమైనది ఈ కార్యక్రమంలో కామారెడ్డి రూరల్ సిఐ.శ్రీ.రామన్ ఎస్ఐ.శ్రీ.రంజిత్. ఎస్ఐ.శ్రీ.భువనేశ్వర్ ఎం.వీ.ఐ.శ్రీ.జె.శ్రీనివాస్ అసిస్టెంట్ ఎం.వి.ఐ. మరియు ఉగ్రవాయి సర్పంచ్ మహేష్ గౌడ్ గ్రామ ప్రజలు.పాల్గొన్నారు

# పిల్లలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి

## -ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్

**నాగిరెడ్డిపేట్,జనవరి13(ప్రజాజ్యోతి):**
పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు.మంగళవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం సక్రమంగా అందించాలని సూచించారు.అంగన్వాడీ కార్యకర్తలు సేవాభావంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పర్యవేక్షకురాలు ఈశ్వరి బాయి,ఆయా గ్రామాల అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# 2వార్డులో బోరుమోటార్ తవ్వకం

**ఎల్లారెడ్డి, జనవరి-13(ప్రజా జ్యోతి)**
పట్టణంలోని 2వ వార్డు పాత ప్రియా టాకీస్ ఏరియాలో మెయిన్ రోడ్ లో జరుగుతున్న రోడ్డు పనులవల్ల వాటర్ పైప్ పగిలిపోయి కాలనీలో తీవ్రనీటి ఎద్దడి ఏర్పడటం వల్ల మంగళవారం కాంగ్రెస్ నాయకులు మంచిర్యాల విద్యాసాగర్ హైదరాబాదులోని ఎమ్మెల్యే స్వగృహంలో కలిసి సమస్యను వివరించడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే 2వ వార్డులో బోర్ వెయ్యాలని అధికారులను కాంట్రాక్టర్ ను ఆదేశించడంతో మంగళవారం సాయత్రం 2వ వార్డులో బోర్ వెయ్యడం జరిగిందని అన్నారు. పుష్కలంగా నీళ్లు రావడంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మదన్మోహన్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వినోద్ గౌడ్, సుజిత్, నరేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం19వ వార్షికోత్సవ వేడుకలు

## ప్రత్యేక అతిథిగా మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్



**గాంధారి జనవరి 13(ప్రజాజ్యోతి)**
గాంధారి మండలంలోని భూర్గుల్ గ్రామంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం 19వ వార్షికోత్సవ వేడుకలు జనవరి 24న ఘనంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జజాల సురేందర్ ను ప్రత్యేక అతిథిగా ఆహ్వానించామని భూర్గుల్ వీడిసి కమిటి సభ్యులు తెలిపారు.వార్షికోత్సవం వేడుకల్లో స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భాగస్వామ్యం కానున్నారు. ఈ సందర్భంగా దేవస్థాన కమిటి ప్రత్యేక కార్యక్రమాల ఏర్పాట్లు పూర్తి చేశాయని వారు తెలిపారు. భక్తులకు సౌకర్యాల కల్పనకు మన్నికైన ఏర్పాట్లు జరుగుతున్నాయి.కమిటీ సభ్యులు, భక్తులు ఈ వేడుకల్లో భాగస్వామ్యం కావాలని, ఆధ్యాత్మిక వాతావరణంలో ఆనందాన్ని పంచుకోవాలని పిలుపునిచ్చారు.

# బిచ్కుంద మున్సిపాలిటీలో సెంటర్ లైటింగ్ పనుల పరిశీలించిన ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



**జుక్కల్ ఆర్సి ప్రజా జ్యోతి జనవరి 13**
బిచ్కుంద మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న సెంటర్ లైటింగ్ పనులను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.లైటింగ్ పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ఎలాంటి లోపాలు తలెత్తకుండా నిర్ణీత కాలవ్యవధిలో పనులు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. పట్టణ ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు పేర్కొన్నారు.పట్టణ అభివృద్ధి దిశగా మౌలిక వసతుల మెరుగుదలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని, అందులో భాగంగానే సెంటర్ లైటింగ్ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# యాసంగి పంటకు నీరు విడుదల

**బీబీపేట్ మండల్ ప్రజా జ్యోతి జనవరి 13**
బీబీపేట మండలంలోనీ యాడారం గ్రామ ఊర చెరువు నుండి మంగళవారం రోజున యాసంగి పంటల నిమిత్తం నీటిని విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గొబ్బూరి సుధారాణి బాపురెడ్డి మాట్లాడుతూ ఇట్టి నీటిని రైతులు యాసంగి పంటకు వాడుకుని అధిక దిగుబడులతో పంటను పండించాలని వారు కోరారు. నీటిని విడుదల చేసినందుకు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీమతి సుధారాణి బాపురెడ్డి గారు ఉప సర్పంచ్ సుద్దాల రాజు నీటిపారుదల శాఖ ఏ ఈ రజిత రెడ్డి మాజీ సర్పంచ్ వెంకట్రావు మరియు వివిధ పార్టీల నాయకులు పుర ప్రముఖులు గ్రామస్తులు పాల్గొన్నారు



# అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమం ద్వారా డ్రైవర్లకు అవగాహన

## మద్యం సేవించి వాహనాలు నడపరాదు

## ఎస్సై జి సందీప్

**ఇందల్వాయి,( ప్రజా జ్యోతి న్యూస్) జనవరి. 13**

ఉందల్వాయి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఎస్సై జి సందీప్ 'అరైవ్ అలైవ్ 'కార్యక్రమం ద్వారా డ్రైవర్లకు,ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఎస్సై జి సందీప్ మాట్లాడుతూ డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు భారీ సంఖ్యలో జరుగుతున్నాయని సూచించారు. డ్రైవర్లు ఆటోలలో ప్రయాణికులను మోతాదుకు మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు.అరైవ్ అలైవ్ అనేది ఒక నినాదం కాదు-ఉద్యమంలా సాగాలన్నారు. ప్రతీ కుటుంబం ఆనందంతో జీవించాలన్నారు.హెల్మెట్ చట్టం కాదు- ప్రాణాన్ని కాపాడే ఆయుధం విధిగ దరించండి అని తెలిపారు.

మంగళవారం 13 జనవరి 2026 నుండి శనివారం 24 జనవరి 2026 వరకు ఈ 'అరైవ్ అలైవ్ ' అవగాహన కార్యక్రమాలు దేశములో నే మొదటి సారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము, డీజీపీ రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా (అరైవ్ అలైవ్) అనే ఒక వినూత్న కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు.ఈ అరైవ్ అలైవ్ అనే ఒక నినాదం కాకుండా అందరిలో రోడ్డు ప్రమాదాలు నివారించే ఒక ఉద్యమంలా ముందుకు సాగాలని అన్నారు. ప్రతి ఒక వ్యక్తి సురక్షితంగా ఇంటికి చేరాలనే వారి కుటుంబ సభ్యుల ఆశను తీర్చే కార్యక్రమం కావాలన్నారు.రహదారి భద్రత నియమ నిబంధనలను పాటించవలసిన అవసరం ఉన్నదని తెలిపారు.రోడ్డు ప్రమాదాలు మన నిర్లక్ష్యం, అతివేగం, అజాగ్రత్త వల్ల జరుగుతాయి.హెల్మెట్ ధరించడం అనేది కేవలం చలాన్లు చట్టం నుండి తప్పించుకోవడానికి కాదు అది మీ ప్రాణాన్ని కాపాడే ఆయుధం అని ప్రతీ ఒక్క వాహనదారుడు గ్రహిచాలి.

మద్య సేవించి వాహనాలు నడపడం వలన రోడ్డు ప్రమాద మరణాలు జరిగి ఎన్నో కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయి వీధిన పడుతున్నాయన్నారు.ఆటో






డ్రైవర్లు ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చే బాధ్యతను గుర్తుంచుకోవాలన్నారు.మొబైల్ వాడకం,ఓవర్ స్పీడ్,రాంగ్ దిశలో డ్రైవింగ్ ఎట్టి పరిస్తితులలో చేయవద్దని సూచించారు. సేఫ్టీ ఫస్ట్ --- మీ కోసం మీ కుటుంబ సభ్యులు ఇంటి వద్ద ఎదురుచూస్తున్నారు అన్న విషయం గుర్తించుకొని జాగ్రత్తగా ప్రయాణాలు కొనసాగించండి అనే సందేశాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జి సందీప్ , సిబ్బంది గంగా కిషన్,రఘు,ఆటో డ్రైవర్లు, ప్రయాణిక ప్రజలు పాల్గొన్నారు

# శిరస్త్రం పెట్టుకో ప్రాణాలు కాపాడుకో

**-ఇతరుల ప్రాణాలుకూడా కాపాడు**

**-రోడ్డు రవాణా బద్రత వారోత్సవాల ప్రతిజ్ఞ**

**-ఆరైవ్ ఆలైవ్ రోడ్ సేఫ్టీ క్యాంపింగ్**

**-తాగి వాహనాలు నడపటం వద్దు**

**ఆర్మూర్,జనవరి 13(ప్రజాజ్యోతి)**

ఆర్మూర్ టౌన్ పోలీస్ ఆధ్వర్యంలో సి కాన్వెన్షన్ హల్ లో -ఆరైవ్ ఆలైవ్ రోడ్ సేఫ్టీ క్యాంపింగ్ నిర్వహించారు.దీనికి ముఖ్య అతిధిగా ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, పాల్గోని మాట్లాడారు. రోడ్ల పై ప్రయాణం చేసే టప్పుడు ద్విచక్ర వాహనం కానీ కారు గాని పెద్ద వాహనాలు కాని నడిపేటప్పుడు కచ్చితంగా ప్రమాణాలు పాటించాలి బైక్ నడిపేవారు ఎల్మెంట్ పెట్టుకోవాలి కారు నడిపేవారు సిట్ బెల్ట్ తప్పక పెట్టుకోవాలి అని అన్నారు. కోవిడ్ వల్ల చనిపోయిన వారికంటే రోడ్డు ప్రమాదాలతో చంపోయేనవారు ఎక్కువ గాఉన్నారు. ప్రమాదాల రెటు ఇప్పుడు మన దగ్గర కొంచెం తగ్గిందాన్నారు. డ్రైవర్ గా మికు అన్ని తెలుసనీ ప్రతి ఒక్కరూ. నియమాలు పాటించాలని అన్నారు. మీరు రాంగ్ రూట్ లో వెళ్లి ఇతరులను ఇబ్బంది చేయకూడదు అని అన్నారు. రోడ్ ట్రాన్స్పోర్ట్ అధికారి మాట్లాతు ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసన్స్ కల్గి ఉండాలని మైనర్ లకు ఎలాంటి వాహనాలు ఇవ్వకండి అని అన్నారు. అలాగే మద్యం సేవించి బండి




నడిపితే కేసులు అవుతాయిని డ్రంక్ ఆన్ డ్రైవ్ లో పట్టు బడితే 10.000రూపాయల జరిమానా ఉంటుంది అని అన్నారు. ఆటో డ్రైవర్ లు ఎక్కువ మందిని కూర్చొబెట్టవద్దు అని అన్నారు డ్రైవింగ్ లో అన్ని రకాలుగా మెలుకువ లు పాటించాలి అని అన్నారు. ఇ కార్యక్రమం లో ఆర్మూర్ టౌన్ సి ఐ సత్య నారాయణ గౌడ్, ట్రాఫిక్ ఎస్ ఐ వివిధ మండల ఎస్ ఐ లు ట్రాఫిక్ పోలీస్ లు ఆటో డ్రైవర్ లు కార్ డ్రైవర్స్ ఇంకా ఇతరులు పాల్గొన్నారు.

## పోచంపాడ్ లో అరైవ్ అలైవ్ ప్రోగ్రాం అవగాహన సదస్సు

**మెండోరా: జనవరి/13 (ప్రజా జ్యోతి)**

మెండోరా మండల కేంద్రంలో అరైవ్ అలైవ్ ప్రోగ్రాం ను డి.జి.పి మరియు సి.పి నిజామాబాదు వారి ఆదేశాల మేరకు 13.01.2026 నుండి 24.01.2026 వరకు రోడ్డు భద్రత లో భాగంగా మెండోరా పోలీసు సిబ్బంది తో ఎస్.ఐ జాదవ్ సుహాసిని పోచంపాడు గ్రామంలో నిర్వహించడం జరిగింది. ప్రతి సంవత్సరం రాష్ట్రంలో కొన్ని వేల మంది రోడ్డు ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని ఆమె తెలిపారు. వాహనాలు నడిపేటపుడు హెల్మెట్ ధరించక పోవడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్, సీటు బెల్ట్ ధరించక పోవడం, అతివేగంగా వాహనాలు నడపడం, మైనర్ లకు వాహనాలను ఇవ్వడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని కావున అందరూ తగు జాగ్రత్తలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలు నివారించడంలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోచంపాడు గ్రామస్థులు హాజరయ్యారు , రోడ్డు ప్రమాదాలు నివారించడం లో అందరు భాగస్వామ్యం కావాలని అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు.



# గౌరారంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మార్కింగ్



**గాంధారి జనవరి 13(ప్రజాజ్యోతి)**

గాంధారి మండలంలోని గౌరారం గ్రామంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ముగ్గులు పోయే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం స్థానిక ఎమ్మెల్యే మదన్మోహన్ ఆదేశాల మేరకు నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బట్టి సువర్ణ, ఉపసర్పంచ్ గాజుల కృష్ణమూర్తి, వార్డ్ సభ్యులు సంగమేష్, మేల్డే లక్ష్మన్, మేకల రమేష్, గ్రామంలోని ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## కమ్మర్పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ

**కమ్మర్ పల్లి జనవరి 13,ప్రజా జ్యోతి.**

కమ్మర్పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఆరోగ్య అధికారి డాక్టర్ రాజశ్రీ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.అమ్మ ఒడి కార్యక్రమం సందర్భంగా గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరిస్థితులు, డెలివరీలకు సంబంధించిన డ్యూ లిస్ట్ వివరాలను డీఎంహెచ్ఓ గారు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వయంగా గర్భిణీ స్త్రీలను పరిశీలించి, అవసరమైన వైద్య సూచనలు అందించారు.అలాగే ప్రయోగశాల (ల్యాబ్), ఫార్మసీ, లేబర్ రూమ్‌లను తనిఖీ చేసి అక్కడి సదుపాయాలపై సమగ్రంగా పరిశీలన చేశారు. టి-హబ్ ద్వారా నిర్వహిస్తున్న పరీక్షలు, మందుల సరఫరా విధానం గురించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రజలకు అన్ని రకాల వైద్య సదుపాయాలు సమర్థవంతంగా అందేలా కృషి చేయాలని వైద్య సిబ్బందికి డీఎంహెచ్ఓ సూచించారు.ఈ కార్యక్రమంలో నరసింహస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



**ధర్పల్లి :జనవరి/ 13 ( ప్రజా జ్యోతి)**

నిజామాబాద్ జిల్లాధర్పల్లి మండలం లోని దుబ్బాక గ్రామానికి చెందిన కురుమ బిరయ్య అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆయన కు జిల్లా బిజెపి అధ్యక్షుడు దినేష్ కులాచారి ఆదేశాలతో సీఎం రిలీఫ్ ఫండ్ అప్లై చేయగా ఈరోజు ధర్పల్లి మండల అధ్యక్షులు జిర్రా మహిపాల్ యాదవ్ వారి స్వగృహానికి వెళ్లి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో రావడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో ధర్పల్లి మండల బిజెపి అధ్యక్షులు జీర్రా మహిపాల్, సీనియర్ నాయకులు కర్క గంగారెడ్డి, కొట్టాల నరేష్ గౌడ్ , మంద నరసయ్య, మంగలి కిషన్, సదానంద్ గౌడ్, బీజేవైఎం అధ్యక్షులు, దోర్నాల రాజశేఖర్, మంద శ్రీకాంత్, అచ్యుతరాజ్, నితిన్ తదితరులు పాల్గొన్నారు

## లోకల్ న్యూస్,సురభి క్యాలెండర్ ఆవిష్కరణ

**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి న్యూస్ ) జనవరి. 13**

ఇందల్వాయి పోలీస్ స్టేషన్లో మంగళవారం లోకల్ న్యూస్ సురభి క్యాలెండర్ ను ఎస్సై జి సందీప్ ఆవిష్కరించారు. అనంతరం ఎస్సై జి సందీప్ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అవాంఛనీయ ఘటనలను వెలికి తీయడమే ధ్యేయంగా పనిచేస్తున్న లోకల్ న్యూస్ సురభి ఛానల్ కు శుభా కాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జి సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

